# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## ఏడుకొండలస్వామీ ఎక్కడున్నావయ్యా!

### -అఖిలాండం వద్ద కొబ్బరికాయలుకొట్టి వెనుదిరుగుతున్న సామాన్యభక్తులు



తిరుమల,ఆగస్ట్ 16(ప్రభాతవార్త)ప్రతినిధి:
మూడురోజులు సెలవులతో కొండ భక్తజనసంద్రంగా మారింది. శనివారం వేకువజామునకే తిరుమలలో కంపార్టుమెంట్లన్నీ భక్తులతో నిండిపోయి గోగర్భమ్‌డ్యామ్ వరకు ఐదు కిలోమీటర్లు ఆలయం వెలుపలకు చేరాయి. దీంతో సాధారణ సర్వదర్శనానికి 40గంటలు సమయంపైగానే భక్తులు దర్శనానికి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యూలైన్లలో నిలబడే ఓపికలేక ఆలయం ముందు అఖిలాండం వద్ద కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని వెనుదిరుగుతున్నారు.

## హరేకృష్ణ...హరే రామ

### పులకించిన ఇస్కాన్ కమలమందిరం
### శ్రీకృష్ణజయంతిన పోటెత్తిన భక్తులు



తిరుపతి,ఆగస్ట్ 16(ప్రభాతవార్త):
ఆధ్యాత్మికనగరం తిరుపతిలోని ఇస్కాన్ కమలమందిరంలో శనివారం శ్రీకృష్ణ జయంతి పర్వదినాన హరేకృష్ణ హరేరామ నామంతో పులకించింది. వేకువజామున ఆలయంలోని మూల విరాట్టుకు ప్రత్యేక అభిషేకాదులు నిర్వహించారు. విశేషాభరణాల అలంకృతుల్ని చేసిన తరువాత భక్తులు ఉదయం నుండి భారీగా ఇస్కాన్‌కు చేరుకుని రుక్మిణీసమేత అష్టసఖులతో ఉన్న శ్రీకృష్ణ పరమాత్ముని దర్శించుకున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రత్యేక క్యూలైన్లద్వారా సంతోషంగా దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకులు ఈ ఏడాది ప్రముఖులకు, దాతలకు ఎలాంటి పాసులు జారీచేయలేదు. ప్రతి భక్తుడు సమానమంటూ అందరికీ ఆలయంలోనికి అనుమతించి శ్రీకృష్ణుని దర్శనం తరువాత అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కమలమందిరాన్ని ఫల,పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ఆలయాన్ని తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, పచ్చదనం సుందరీకరణ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, శాప్ ఛైర్మన్ రవినాయుడు,ఎంఎల్ఏ శ్రీనివాసులు ,నగర కమిషనర్ మౌర్య ,జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు తదితరులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు చక్కటి ఏర్పాట్లుచేశారు. క్యూలైన్ల నిర్వహణ చక్కగా చేపట్టడంతో భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు.

## హరోం హరా.. వేల్ మురుగా

### - భక్తులతో కిటకిటలాడిన గుడివంక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయం !!
### - రాతిగుండ్లు లాగుతూ.. నోట్లో శూలాలలో మొక్కులు చెల్లింపు !!





గుడుపల్లె, ఆగస్టు 16 ప్రభాతవార్త
హరోం హరా వేల్ మురుగా నినాదాలతో గుడివంక శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయం మార్మోగింది. ఆడికృత్తిక సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పట్టు వస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు. గుడుపల్లె మండల సరిహద్దుల్లో గుడివంక వేపమానుకొండపై వెలసిన శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి భక్తుల కొంగుబంగారం. ఏటా ఇక్కడ ఆడి కృత్తిక ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. శనివారం ఉదయం నుంచే కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలకు చెందిన భక్తులు గుడివంక ప్రాంతానికి చేరుకున్నారు. కొండ కిందిభాగంలో ఉన్న పశ్చిమధారావాహినిలో స్నానాలు ఆచరించిన అనంతరం అక్కడే వెలసిన శ్రీ గంగాధరేశ్వరస్వామిని భక్తులు దర్శి ంచుకున్నారు. అనంతరం హరోంహరా వేల్ మురుగా నినాదాలతో వేపమానుకొండకు బయలుదేరారు.

**వివిధ రకాల విన్యాసాలతో మొక్కులు చెల్లింపు :**

ఆడిక ృతిక సందర్భంగా మొక్కులు కలిగిన భక్తులు వివిధ రకాల విన్యాసాలు చేస్తూ గుడివంకకు చేరుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు భారీ రాతి గుండ్లను లాగుతూ వచ్చారు. మరికొందరు భారీ శూలాలను నోట్లో గుచ్చుకుని వచ్చి మొక్కులు చెల్లించారు. పలువురు కొక్కీలకు వేలాడుతూ విన్యాసాలు చేస్తూ వచ్చారు. ఆలయం వద్ద రాత్రి దాకా భక్తుల తాకిడి కన్పించింది. ఆడికృతిక సందర్భంగా గుడివంక ఆలయ ప్రాంతం, కొండ క్రింది ప్రాంతంలో వివిధ రకాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరిపించారు. కార్యక్రమాల్లో కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మండల టిడిపి అధ్యక్షుడు బాబునాయుడు, నేతలు బేటప్పనాయుడు, హేమాంబరగౌడు తదితరులు పాల్గొన్నారు.

## పల్లకిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



పాకాల, ఆగస్టు 16, ప్రభాతవార్త
పాకాల మండలం ఉప్పరపల్లె పంచాయతీలోని ఊట్లవారిపల్లె సమీపాన ఆనందగిరి కొండపై వెలసిన శ్రీ వల్లి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి 77వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆలయ అధికారులు ఎస్పీకి దగ్గరుండి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేయించి, తీర్థ ప్రసాదాలను అందించారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక శ్రద్ధ వహించారు. భక్తులకు త్వరితగతిన దర్శనభాగ్యం కలిగేలా వారికి త్రాగునీరు, భోజన వసతి, లడ్డు ప్రసాదాల వితరణను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో, అధికారులతో కలసి దగ్గరుండి చేశారు. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల చర్యలను అధికారులతో కలిసి చేపట్టారు. ఆలయ పరిసరాలు శానిటేషన్, ప్రత్యేక వైద్య సిబ్బంది, పోలీసు యంత్రాంగంతో భద్రతా పరిచర్యలు చేపట్టారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు ఆలయ ప్రాంగణం అంతా విద్యుత్ దీపాలంకరణతో, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే తెలిపారు. ఉదయం పాలకావిడి పాలాభిషేకం, స్వామి వారి కల్యాణోత్సవం జరిగింది. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం రాత్రి నిర్వహించిన పుష్ప పల్లకి సేవలో శ్రీ వల్లి, దేవసేన సతీ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని చక్కగా అలంకరించారు. అలంకార భూషితులైన స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

## కాణిపాకంలో
## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

### -గోశాలలో వైభవంగా గోపూజ



గోశాల వద్దకు పూజా సామాగ్రిని తీసుకువెళుతున్న ఆలయ ఈఓ, అధికారులు, ఉభయదారులు
గోమాతకు పూజలు నిర్వహిస్తున్న ఈఓ పెంచల కిషోర్ కుటుంబసభ్యులు, ఉభయదారులు.

కాణిపాకం, ఆగస్టు 16 ప్రభాతవార్త:
శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంను దేవస్థానం గోశాలలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలకు కాణిపాకంకు చెందిన ధనంజయ యాదవ్,దేవరాజులు యాదవ్, రేణుగోపాల్ యాదవ్, రాజేంద్ర యాదవ్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉత్సవ ఉభయదారులు, ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ అధికారులు ఉదయం ప్రధాన ఆలయం నుండి పూజాసామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోశాలకు తీసుకువచ్చారు. అనంతరం గోశాల వద్ద శ్రీకృష్ణుని చిత్రపటంతో పాటు గోమాత చిత్రపటాన్ని వుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోశాలలోని గోమాతలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ వేదపండితులు గోమాతలకు సంప్రదాయబద్ధంగా అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం గోమాతలకు ఈఓ దంపతులు ఆలయ అధికారులతో కలసి మేతను అందించారు. ఈసందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానంలో అమలవుతున్న గోపూజ కార్యక్రమంను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏఈఓ ధనుంజయ, సూపరెండెంట్‌లు వాసు, ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్టికొట్టిన యువకులు

గోకులాష్టమి సందర్భంగా కాణిపాకం దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన ఉట్ల పండుగలో స్థానిక యువకులు, ఉత్సవ ఉభయదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈఉట్టికొట్టే కార్యక్రమంను ఆలయ ఈఓ పెంచల కిషోర్ దంపతులు ఉట్టికొట్టి ప్రారంభించారు.అనంతరం యువకులు ఉట్టికొట్టే కార్యక్రమంలోఉత్సాహంగా పాల్గొని ఉట్టికొట్టారు. అలాగే చిన్నపిల్లలు రాధాకృష్ణుల వేషంలో అలరించారు.

## గొర్రెనెత్తుకెళ్ళిన చిరుత...!

### -భయం గుప్పెట్లో అంకాలమ్మకొండ పరిసరాలు



చిరుత ఆవాసం ఏర్పాటు చేసుకొన్న అంకాలమ్మకొండ, చిరుత దాడిలో గాయపడ్డ గొర్రెపిల్ల

చౌడేపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త
మేతకోసం వెళ్ళిన గొర్రెను చిరుత ఎత్తుకెళ్ళడంతో ఆ ప్రాంత రైతులు భయంతో కేకలు వేశారు...ఒకరికొకరు కలుసుకొని కొండంతా జెల్లడ పట్టినా ప్రయోజనం లేక పోయింది...అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది...మండలంలోని పంచాయతీ కేంద్రం ఆమిని గుంటకు చెందిన ప్రభాకర్, సయ్యద్‌భాషాలు కలసి సమీపంలోని అంకాలమ్మకొండకు మేతకోసం తరలించారు. కొండపైగల చీలినగుండు వైపు గొర్రెలు వెళుతుండగా ఎక్కడ నుంచి వచ్చిందో మాయదారి చిరుత గొర్రెలపై పడింది. ఒక గొర్రెను నోట కరిచ తీసుకెళుతుండగా కాపరి సునీల్ దూరం నుంచి రాళ్ళదాడి చేయడంతో దాన్ని విడచిపెట్టింది. తర్వాత కొంతదూరంలో వున్న మరో గొర్రెను ఎత్తుకెళ్ళిందని సునీల్ తెలిపాడు. తాను కేకలు వేసుకొంటూ కొండ దిగేశానన్నాడు. తమకు 95గొర్రెలున్నాయనీ, చిరుత దాడి తర్వాత 87వున్నాయన్నాడు. గొర్రెల కాపరులందరూ కొండపైకి ఎక్కి వెతుకగా అక్కడక్కడా రక్తపు మరకలను వారు గుర్తించారు. అదే విధంగా చిరుత కాలి ముద్రలను చూసినట్లు వారు వివరించారు. అధికారులకు తెలిపినా తగు చర్యలు తీసుకోలేదనీ, ఇకనైనా చర్యలు తీసుకొని కాపాడాలని రైతులు కోరుతున్నారు.

## పద్మగిరికి పోటెత్తిన భక్తులు

### భక్తులు భక్తిశ్రద్ధలతో కావడి మొక్కులు చెల్లింపు



తిరుపతి రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త
ఆడికృతిక పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుపతి రూరల్ మండలం తనపల్లెలో వెలసిన శ్రీబాలజ్ఞాన దండాయుధపాణి స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. తొలుత వేకువజామున స్వామి వారికి అభిషేకం నిర్వహించి ఉదయం 6.30 గంటలకు భక్తులకు దర్శనం కల్పించారు. హరోం హరా వేల్ మురుగా నినాదాలతో ఆలయం మార్మోగింది. పిల్లలు, పెద్దలు భక్తి శ్రద్ధలతో కావడిలు తీసుకొచ్చి తమ మొక్కు చెల్లించుకున్నారు. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది.

## భక్తి శ్రద్ధలతో గోకులాష్టమి పూజలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో శనివారం గోకులాష్టమి సంబరాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం బిక్షాల గాలిగోపురం సమీపంలో సప్తగోకులంను ఏర్పాటు చేసారు. ఏడు రకాల గోవులను ఏర్పాటు చేసారు. ఇక్కడ నిత్యం పూజలు జరుపుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు గోవులకు ఆహారం అందిస్తున్నారు. శనివారం గోకులాష్టమి సందర్భంగా ఆలయ డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి సారథ్యంలో పూజలు జరిపారు. అలాగే లోబావిలోని గోశాలలో గోకులాష్టమికి శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు జరిపారు. సన్నిదివీధిలో శనివారం మణి అండ్ రవి సారథ్యంలో ప్రత్యేక అలంకారాలు జరిపారు. భక్తులకు సుమారు వంద కిలోల ప్రసాదాన్ని అందించారు. మాజీ కౌన్సిలర్ రవి సారథ్యంలో పూజలు జరిపారు.

## ఆగని గంజాయి వ్యాపారం

### శ్రీకాళహస్తిలో అసలు సూత్రధారి ఎవరు?



సలీం. అల్లాబక్ష్

తొట్టంబేడు,ఆగస్టు 16 ప్రభాతవార్త
తొట్టంబేడు మండలంలోని కొత్తకండ్రిగ తెలుగుగంగ కాలువ గట్టు మీద అనుమానాస్పద స్థితిలో గంజాయి ప్యాకింగ్ చేస్తూ పట్టుబడినట్లు బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమ్మయ్య వివరించారు. శనివారం పోలీసులు అందించిన సమాచారం మేరకు అన్నమయ్యజిల్లా రాయచోటికి చెందిన ఇద్దరు ఇక్కడ ప్యాకింగ్ చేస్తూ పోలీసులకు దొరికి పోయారని తెలిపారు. రాయచోటికి చెందిన సలీం, అల్లాబక్ష్‌లను అదుపులో తీసుకొని వారు ప్యాకింగ్‌చేస్తున్న 20కిలోల గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.ముందుగా అందిన సమాచారంమేరకు ఆకస్మికంగా దాడి జరిపి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ తిమ్మయ్య తెలిపారు.

**అసలేం జరుగుతుంది ?**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఎంతో ప్రశాంత వాతావారణం ఉంటుంది. అయితే గత కొంత కాలంగా ఇక్కడ గంజాయి అమ్మకాలు విచ్చల విడిగా మారాయి. అంతేకాక గంజాయి సేవించే బ్యాచ్‌లు కూడా పెరిగాయి. పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున పట్టణానికి పడమర పొద్దుగుంకితే మహిళలు ఈ మార్గంలో సంచరించే పరిస్థితి లేదు. అయితే ఈ బ్యాచ్‌లకు బాస్ ఎవరు అనే దిశగా పోలీసులు విచారణ జరపాలి! మరి ఈ ప్రయత్నం ఎందుకు జరగటం లేదనే ప్రశ్న చోటు చేసుకుంది. ఇప్పటికి అంతరాష్ట్ర గంజాయి దొంగలనుకూడా పట్టుకున్నారు.పోలీసులు పట్టుకున్న గంజాయి అక్రమరవాణాదారులు,వ్యాపారాలకు సంబంధించి ఎందుకు ఛేదించలేక పోతున్నారనే చర్చ జరుగుతుంది. విశాఖ పట్టణంలో విస్తారంగా గంజాయి పండిస్తున్నట్లు సమాచారం. అక్కడ నుంచి తమిళనాడు, కర్నాటకలకు విచ్చల విడిగా రవాణా చేస్తున్నారు.కొందరు అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ యువకులు ఇదో ఆదాయ మార్గంగా ఎంచుకొని ముందుకు వెళుతున్నారు. ఎన్ని సార్లు పోలీసులు పట్టుకున్నా పరిస్థితిలో మార్పు రావటం లేదు.సులభ సంపాదనకు అలవాటు పడ్డ యువకులు గంజాయి వ్యాపారాలను ఎంచుకున్నారు.విశాఖలో కిలో సుమారు రూ.10 వేలు ఉంటుంది. దానిని తెచ్చి ఇక్కడ ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి లక్షలు సంపాదించుకుంటున్నట్లు సమాచారం. అమ్మటమే కాకుండా సేవించటానికి కూడా అలవాటు పడుతున్నారు. ఇప్పటికైనా అసలు అమ్మకాల బాస్ ఎవరు అనేది ఛేదించాలి.

## సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టేలా పారిశుద్ధ్య పనులు

### నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు- యురియా సమస్యకు సత్వర పరిష్కారం
### త్వరలో పెండింగ్ బిల్లులు చెల్లింపుకు చర్యలు - జడ్పీ సర్వసభ్య సమావేశంలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు




చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:
వర్షాకాలం ప్రారంభం కావడంతో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చెక్ పెట్టడానికి పక్కాగా చర్యలు చేపట్టాలని అధికారులను జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఆదేశించారు. జడ్పీ నూతన సమావేశభవనంలో శనివారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎంఆర్ఐ, సిటీ స్కాన్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరిగే ప్రతి ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా అధికారులు గర్భిణీల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సమయంలో ప్రతి చిన్న కారణంతో గర్భవతులను రెఫరల్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తుండటంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు సరైన వైద్యం ఇవ్వరనే ప్రచారం పెరుగుతుందన్నారు. సాధ్యమైనంత వరకు ప్రతి ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కొంత మంది జడ్పీటిసీలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి తమకు ఆహ్వానం అందడం లేదని సమావేశం దృష్టికి తీసుకురావడంతో జడ్పీ ఛైర్మన్ స్పందిస్తూ ప్రభుత్వం చేపట్టే వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పంపేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రజా సేవ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వుందని, ప్రజల నమ్మకంను వమ్ము చేయకుండా ప్రతి స్థానిక సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన అన్ని అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల పెండింగ్ ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు. అలాగే సర్వసభ్య సమావేశంలో సభ్యులు సమావేశంలో ప్రస్తావించిన ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారులు బాధ్యతగా తీసుకుని పరిష్కరించాలన్నారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని సమావేశం దృష్టికి తీసుకురాగా ఛైర్మన్ స్పందిస్తూ ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పంపేలా చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి శాఖలకు సంబంధించి పెండింగ్ బిల్లులను త్వరలో చెల్లించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ అందని రైతులు తమ భూమి వివరాలు, ఆధార్ ఇకెవైసి సమస్యలను గుర్తించి సరిచూసుకోవాలన్నారు.

## వరదుని ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

**కాణిపాకం, ఆగస్టు 16 ప్రభాతవార్త:**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి, భూదేవి సయిత వరదరాజుల స్వామి ఆలయంలో శనివారం శ్రీకృష్ణ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కాణిపాకం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు యాదవ కులస్థులచే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణుని, పోతురాజు శిలా ఈవిగ్రహాలకు ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అలాగే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్,కాణిపాకం యాదవసంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

***వరదునికి వైభవంగా గరుడసేవ***

శ్రీకృష్ణ జయంతి సందర్భంగా స్వామివారికి శనివారం రాత్రి గరుడసేవను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అగరంపల్లెకు చెందిన నడిపిమండడి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయంలో ఉదయం వారు స్వామి, అమ్మవార్లుకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీదుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అరగొండలో వైభవంగా ఆడికృత్తిక వేడుకలు

-కిక్కిరిసిన భక్తజనం



**తవణంపల్లె, ఆగస్టు 16 ప్రభాతవార్త:** మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయం భువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో శనివారం ఆడికృతిక ఉత్సవాలు అత్యంత వైభవోఎతంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త ఆలయ ధర్మకర్త పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భరణి వేడుకలు నిర్వహించగా, శనివారం ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్ల మూలవిరాట్‌లకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారికి భక్తిశ్రద్దలతో పుష్పకావళ్ళను తీసుకువచ్చి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్వామి దర్శనార్థం వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అదేవిధంగా అర్దగిరి రోడ్డు వద్దనున్న శ్రీహరోహర స్వామీజీ సమాధి వద్ద కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇదిలా వుండగా మండల కేంద్రం తవణంపల్లెలో శ్రీసుబ్రమణ్యా స్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అపోలో మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జి నరేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

## తనపల్లిలో కాల్వస్థలం ఆక్రమణ...ప్రహరీనిర్మాణం

– తొలగించిన రెవెన్యూ అధికారులు

**తిరుపతిరూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:**





తిరుపతిరూరల్ మండలం తనపల్లి పంచాయతీలో కాల్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను శనివారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. తనపల్లి గ్రామ లెక్కదాఖల సర్వేనెంబర్ 228లో 65 సెంట్ల కాల్వపోరంబోకు స్థలం ఉంది. ఈ స్థలంలో ప్రవేట్ ధర ప్రకారం అంకణం ధర దాదాపు రూ.2లక్షలకు పైగా పలుకుతుంది. తిరుపతిలోని ఓ ద్విచక్ర వాహన డీలర్ ఆక్రమణకు ప్రయత్నించినట్లు సమాచారం. కాల్వ స్థలం ఆక్రమణ గుర్తించిన స్థానికులు అడ్డుకున్నా ఆక్రమణదారులు పట్టించుకోకుండా ప్రహరీ గోడను యదేచ్ఛగా కట్టేసారు. ఈ విషయం మీడియాకు తెలియడంతో తిరుపతిరూరల్ రెవెన్యూకు సమాచారం ఇవ్వడంతో ...తహశీల్ధార్ రామాంజుల నాయక్ ఆదేశాల మేరకు ఆర్.ఐ. రఘువర్మ, విఆర్వో వలర్‌మతిలు జెసిబి సాయంతో తొలగించారు. కాల్వస్థలం ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## షణ్ముగుని రాజసం

**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 16 ప్రభాతవార్త**



ఏర్పేడు మండలం గుడిమల్లం గ్రామంలో వెలసిన కార్తీకేయుని ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. శనివారం ఉదయం ఆడికృత్తిక సందర్భంగా పరశురామేశ్వరాలయంలో వెలసిన సుబ్రమణ్యం స్వామికి రక రకాల అభిషేకాలు జరిపారు. అలంకారాలు జరిపారు. గుడిమల్లం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు,రాష్ట్ర సేవా సమితికి చెందిన వెంకటరత్నం నాయుడు,పద్మనాభనాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి వస్తున్న రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సరాసరి చెప్పలేరు కాబట్టి తమ ఆరోపణలు,ఫిర్యాదులను చేయటానికి 'ఫిర్యాదుల పెట్టెను' ఏర్పాటు చేసారు. ఆసుపత్రిలో ఫిర్యాధుల పెట్టెను బొజ్జల బృందమ్మ ప్రారంభించారు. బాధితులు ఫిర్యాదులను పెట్టెల్లో వేస్తే వారం వారం ఆసుపత్రి చైర్మెన్, శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి పరిశీలించి చర్యలు తీసుకుంటారని ఆమె వివరించారు. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి పట్టుదలగా ఉన్నామన్నారు. రోగులకు సేవలందించుటకు ఇక్కడ నుంచి రెఫరల్ సంప్రాదాయాన్ని రూపు మాపుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఆసుపత్రిలో ఎక్స్ రే, ఇసిజిలాంటి సదుపాయాలున్నాయని, ఇంకా మెరుగైన సేవల కోసం ప్రభుత్వంతో చర్చిస్తున్నామని బృందమ్మ వివరించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు,శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి కమిటి సభ్యులు గరికపాటి రమేష్,వినయ్,సుమతి తదితరులు పాల్గొన్నారు.

## 12.హాజరైన భక్తులు ఉభయదారులు

నిత్యాన్న ప్రసాదానికి విరాళం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న పథకానికి భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. ఈనేపధ్యంలో కుమారదేవం గ్రామానికి చెందిన కాసాని శ్రీహరిగౌడ్ దంపతులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. తరువాత ఎఇఓ మోహన్‌తో కలసి తాము నిత్యాన్నదాన పథకానికి వారి తల్లిదండ్రుల పేరుతో నిత్యాన్న పథకానికి రూ.1,00,116లు విరాళంగా అందించారు. వారికి ఎఇఓ మోహన్ అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. వారికి వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## బండారుపల్లిలో గోకులాష్టమి సంబరాలు

**శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త**



ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కృష్ణామాశ్రమంలో జరుగుతున్న 46వ వారోత్సవాలల్లో భాగంగా శనివారం గోకులాష్టమి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు చోటు చేసుకున్నాయి.కాగా గోకులాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు జరిపారు. ట్రాక్టర్లో ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను మాజీ మండలాధ్యక్షుడు ఎం వెంకటరెడ్డి, ధార్మిక వాది హరి, సదానందస్వామి త దితరులుపర్యవేక్షించారు.

## అసాంఘిక కార్యక్రమాలపై కెమెరా నిఘా

**శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త**



పుణ్యక్షేత్రంలో భక్తుల భద్రత సౌకర్యార్థం కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు డివైయస్‌పి నరసింహామూర్తి తెలిపారు.శనివారం రాత్రి పట్టణంలోని కూడలిలో కవాతు నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటల నుంచి కూడలి ప్రాంతాల్లో సిఐలు పర్యవేక్షించటం గమనించదగ్గ విషయం.శ్రీకాళహస్తిలో నిత్యం జనం ట్రాఫిక్ సమస్యలతో సతమతమౌతున్నారు. అయితే వీధులు ఇరుక్కుగా ఉండటంతో ఇ బ్బందిగా మారింది. అయితే పట్టణం చుట్టూ కొండలు,కోనలు ఉండటంతో డ్రెన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు డివైయస్‌పి వివరించారు. ముఖ్యంగా కొండ ప్రాంతాలు, అడవి ప్రాంతాల్లో సాగుతున్న అసాంఘీక శక్తులపై నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ కవాతులో శ్రీకాళహస్తి వన్‌టౌన్ సిఐ డి.గోపి,2టౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి, బియన్ కండ్రిగ సిఐ తిమ్మయ్య, రూరల్‌ఎస్ఐ నరసింహా, తొట్టంబేడు ఎస్ఐ బలరాం,పిఎస్ఐలు సబ్‌డివిజన్‌పోలీసులు పాల్గొన్నారు.

## శరవేగంగా స్మశాన వాటిక అభివృద్ధి పనులు

**కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలోని స్మశాన వాటికను రూ 3కోట్ల నిధులతో ఆధునీకరిస్తున్న విషయం విదితమే. ఇటీవలే ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో స్మశాన వాటిక అభివృద్ధి పనులు నిరాటంకంగా శరవేగంగా జరుగుతున్నాయి. ఆధునీకరిస్తున్న స్మశాన వాటిక పనులను శనివారం మున్సిపల్ కమీషనర్ ఉయ్యాల శ్రీనివాసరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునీకరిస్తున్న స్మశాన వాటికలో ఎల్‌పిజి బర్నింగ్ యూనిట్ సిస్టం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అలాగే స్మశాన వాటికలో గదుల నిర్మాణం, నీటి వసతి, స్నానపు సౌకర్యాలు కల్పించడంతో పాటు మినీ ఉద్యానవనం సైతం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. పనులు డిసెంబర్ నాటికల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## శ్రీసుబ్రమణ్యస్వామికి విశేష పూజలు.. అన్నదానం



***కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త*** కుప్పం పాతపేట కమతమూరు క్రాస్‌రోడ్‌లో నెలకొన ఉన శ్రీ ప్రసన్న బాలసుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని ప్రత్యేక ంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. అంతకుముందు ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారి ఉత్సవాన్ని ఊరేగించారు. కార్యక్రమాల్లో కడ సభ్యులు రాజ్‌కుమార్, రెసో క్ర ఛైర్మన్ ప్రతాప్‌కుమార్,కౌన్సిలర్ సోమశేఖర్, నేతలు సత్యేంద్రశేఖర్, మంజు, వేణుగోపాల్, నాను, శేఖర్, సతీష్, గంగమ్మగుడి డైరెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త**



శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం కుప్పంలో యాదవ సంఘంచే ఘనంగా నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్‌లోని కార్యాలయంలో శ్రీకృష్ణ పరమాత్ముడి విగ్రహం ఏర్పాటుచేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. కార్యక్రమాల్లో రాష్ట్ర యాదవ సంఘం నేత మణియాదవ్, ఆనంద్‌యాదవ్, కౌన్సిలర్ జాకీర్, జనసేన కోఆర్డినేటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు పశుసంరక్షణ కిట్ల పంపిణీ

**వి.కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త**



మండలంలోని పలువురు పాడి రైతులకు శ్రీజ పాల డెయిరీ తరపున పాలమిత్ర నారాయణస్వామి అధ్వర్యంలో పశు సంరక్షణ కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీజ డెయిరీ ద్వారా 57882మంది రైతులకు 13కోట్ల దాకా బోనస్ అందించినట్లు తెలిపారు. పాడి రైతుల ద్వారా పాలను మిగతా డెయిరీల కంటే అధిక ధరకు కొనుగోలు చేయడంతో పాటు పాడిఆవులకు అవసరమైన పశుగ్రాస విత్తనాలను సైతం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాజు, కిషోర్‌రెడ్డి, వివిఎ మోహన్, రైతులు పాల్గొన్నారు.

## అమరావతి కాలనీలో వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు

**కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త**



మున్సిపల్ పరిధి అమరావతి కాలనీలో వీధి లైట్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కాలనీ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ కూడా వీధి లైట్ల సమస్య రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పలుచోట్ల లైట్లు సరిగ్గా వెలగడం లేదని ప్రజలు తెలపడంతో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేసేలా మున్సిపల్ విద్యుత్ సిబ్బందిని ఆదేశించామన్నారు. రెండు రోజుల్లోపు నూతన వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

**కల్లూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త**



పులిచెర్ల మండలం కల్లూరు శ్రీ చంద్రమోళీశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో పరమేశ్వరుడికి, సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్రరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు

**కల్లూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త**



పులిచెర్ల మండలంలో ఈ రామిరెడ్డి గారి పల్లెలో వెలసి ఉన్న, కొత్తపేట పంచాయతీ బోధమతగారి వెలసి నను బ్ర హ్మణ్యం స్వామి ఆలయంలో ఆడికృతిక సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకము, ప్రత్యేక అలంకారంలో నక్షత్ర హారతులు ఇచ్చారు. భక్తు లకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సుబ్ర మణ్య స్వామి దర్శిస్తే ఆయన కొలువైన ఆరు క్షేత్రాలను దర్శించినట్లు అన్ని భక్తులు భావిస్తారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

## యువతకు సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తిదాయకం

– ఎంపి దగ్గుమళ్ళ, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు



**చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ కారకుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ఆధునిక యుగానికి స్ఫూర్తిదాయకమని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే సుమిత్‌కుమార్‌లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన 116వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్య అతిధిగా హాజరు కాగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, కలెక్టర్ సుమిత్‌కుమార్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతలు అతిధులుగా పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌లు సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, మేయర్ అముద, మొదలియార్ సంఘ అధ్యక్షులు త్యాగరాజన్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీ, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జనవిజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం

**పలమనేరు టౌన్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**



జిల్లా జనవిజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం ఏర్పాటైంది. శుక్రవారం స్థానిక సాయిమేధా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు కరమల గిరిధరమూర్తి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు డా.గేయానంద్ మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, శాస్త్రీయ సమాజ నిర్మాణమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని అన్నారు. సోషల్‌మీడియా ప్రభావంతో ప్రజల్లో మూఢనమ్మకాలు, సూడో సైన్స్, అశాస్త్రీయ భావజాలం విపరీతంగా ప్రచారం అవుతోందని వీటిని అరకట్టడానికి విజ్ఞాన వేదక నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. మరో ముఖ్య అతిథి పలమనేరు బాలాజీ మాట్లాడుతూ వ్యక్తుల మధ్య సంబంధాలు అడుగంటి పోతున్నాయని, అశాస్త్రీయత పెరిగిపోతోందని సమాజం మంచి మార్గంలో పయనించడానికి జనవిజ్ఞాన వేదిక కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా అరుణ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మిఠాయి యుగంధర్, కోశాధికారిగా కరమల గిరిధర్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ నాయకులు యుగంధర్, మునిరత్నం, సుధాకర్, విజయకుమార్, ఆనంద్‌బెన్, సెల్వం, శ్యామల, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరువాసుల విరాళం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి భూరి విరాళాలు అందుతున్నాయి. ఈ నేపధ్యంలో శనివారం గుంటూరుకు చెందిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని ఎఇఓ మోహన్‌తో తాము విరాళం ఇవ్వటానికి సూచించారు. దాంతో గుంటూరుకు చెందిన అద్దేపల్లి దీప్తి,మహేశ్వరి దంపతులు రూ.1,11,116లు విరాళంగా అందించారు. వారికి ఎఇఓ మోహన్ స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. వారికి వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలను అందించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పలమనేరులో వైభవంగా శ్రీకృష్ణాష్టమి

**పలమనేరు టౌన్, ఆగస్టు 16, ప్రభాతవార్త:**



శ్రీకృష్ణామి వేడుకలు పలమనేరులో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వారిని వివిధ రకాల పూలు తోరణాలతో అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే గంటావూరు నుండి పిల్లనగ్రోవి చేతబట్టిన శ్రీ కృష్ణుని ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మదనపల్లె రోడ్డు, ఎంబిటి రోడ్డు, జవిళివీధి, ఎద్దులసంతవీధి మీదుగా ఊరేగింపు సాగింది. ఇళ్ళలోనూ గృహస్తులు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

## ఘనంగా అడికృత్తిక వేడుకలు

**పలమనేరు, ఆగస్టు 16, ప్రభాతవార్త:**

అడికృత్తిక ఉత్సవాలు పలమనేరులో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. టిఎస్ అగ్రహారంలో కొండపై వెలసిన శ్రీవళ్ళీ సమేత సుబ్రమణ్యస్వామిని వివిధ అలంకారాలతో పూజలు చేశారు. ఉదయం 3 గంటల నుండే స్వామి వారి అభిషేకాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుండి కావళ్ళతో వచ్చిన భక్తులు హరో హర, హరహర మహాదేవ అంటూ నినాదాలతో హోరెత్తించారు. పిల్లలు, పెద్దలు వరకు కావళ్ళతో వెళ్ళి మొక్కుబడులు తీర్చుకున్నారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కొండపైకి కాలినడకన వెళ్ళి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పుష్పగుచ్చాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలమనేరు నుండి ఆటోలు, కార్లు, వివిధ వాహనాల రద్దీతో టిఎస్ అగ్రహారం రహదారి కిటకిటలాడింది.

## తవణంపల్లెలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**తవణంపల్లె, ఆగస్టు 16 ప్రభాతవార్త:**



శ్రీకృష్ణాష్టమి పండుగ పర్వదినాన్ని మండలంలోని జొన్నగురకల, అరగొండ, మత్యం, ఎం.గొల్లపల్లె, నల్లిశెట్టిపల్లె, నారసింహనపల్లె, దిగువమాఘం, వీర్లగుడిపల్లె, తదితర గ్రామాలలోని శ్రీకృష్ణ భజన మందిరాల్లో స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. అలాగే రాత్రి తనకిష్టమైన గరుడవాహనంపై స్వామివారిని వుంచి పురవీధుల్లో ఊరేగించారు. అదేవిధంగా మండలంలోని అరగొండలో స్థానిక యాదవ వంశస్థులచే శ్రీకోదండరాముల వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారిని గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు.

***ఐరాలలో...***

**ఐరాల, ఆగస్టు 16 ప్రభాతవార్త:**

శ్రీకృష్ణాష్టమి పండుగ పర్వదినాన్ని మండలంలోని గొల్లపల్లె, జి.మిట్టూరు, కలికిరిపల్లె, ఇరువారపల్లె, ఐరాల,యల్లంపల్లె, ముదిగోళం, నాగంవాండ్లపల్లె, కాణిపాకం తదితర గ్రామాలలోని శ్రీకృష్ణ భజన మందిరాల్లో స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. రాత్రి స్వామివారిని గరుడవాహనంపై గ్రామ పురవీధులలో ఊరేగించారు.

## నిత్యాన్నదాన పథకానికి సరుకుల వితరణ

**కాణిపాకం, ఆగస్టు 16 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలు జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం 2.50 లక్షల రూపాయలు విలువగల సరుకులను విరాళంగా అందజేశారు. ఈమేరకు తవణంపల్లె మండల మైనగుండ్లపల్లెకు చెందిన అంజిరెడ్డి అనే భక్తుడు నిత్యాన్నదాన పథకానికి కావలసిన 200 బస్తాల బియ్యంతో పాటు పప్పు, నూనె, కూరగాయలను ఆలయానికి విరాళంగా అందజేశారు. వీటిని ఆలయ పడితరం స్టోర్ వద్ద ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణిలకు అందజేశారు.

## వైభవంగా శ్రీ కృష్ణ జయంతి

**పుంగనూరు రూరల్, ఆగస్టు 16, ప్రభాతవార్త**



పట్టణంలో శ్రీకృష్ణ జయంతిని శనివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వైష్ణవ ఆలయాలలో ఉత్సవ మూర్తికి శ్రీకృష్ణుని అలంకరణ నిర్వహించారు. భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ఆలయం వద్ద పూజ హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులతో పట్టణ వీధులలో ప్రదర్శన నిర్వహించారు. గుడి రామచంద్ర యాదవ్ తలపెట్టిన ఈ జన్మాష్టమి వేడుకలలో పలు పార్టీల నాయకులు వందలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

## శ్రీవారి శ్రావణమాస ప్రసాద వితరణ

**పుంగనూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త**



చాతుర్మాస వ్రత దీక్షలలో మాసాలలో శ్రావణ మాసం అత్యంత పవిత్రమైన తొలి మాసం. శ్రీవారు శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రియమైన మాసంలో ప్రతి శనివారం శ్రీవారి భక్తులకు ప్రసాద వితరణకు తనకు అనుగ్రహం కలిగిందని విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు అన్నారు. మూడవ శనివారం కూడా సుకుమార్ బాబు దంపతులు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ స్థానిక శ్రీ వెంకటరమణ స్వామి ఆలయంలో చేపట్టారు. సంగీత ప్రియులను ప్రోత్సహిస్తామని ప్రగతి దాత వాలంటరీ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు సులోచన తెలిపారుదేశంనాయకులురవిచంద్ర,రామకృష్ణ,ఆలయకార్యనిర్వహణఅధికారిసిబ్బందిభక్తులు పాల్గొ న్నారు.

## కోళ్ళఫారంలో వలస కూలీ మృతి

**చౌడేపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త**



కోళ్ళఫారంలో పనిచేస్తున్న వలస కూలీ ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన శనివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని కాగతి పంచాయతీ యనమసామనపల్లికి సమీపంలో ప్రైవేటు కోళ్ళఫారముంది. అక్కడ చత్తీస్గడ్‌నుంచి నందకుమార్‌యాదవ్(35)వచ్చి కూలీ పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో పనిచేస్తుండగా ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలాడు. చుట్టు పక్క లున్నవారు మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే నందకుమార్ యాదవ్ మృతి చెందిన వైద్యులు ధృవీకరించారు.పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

## కన్నుల పండుగలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**చౌడేపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త**



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండల వ్యాప్తంగా శాస్త్రసోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు వశిష్టాచార్యులు ఆధ్వర్యంలో ఉదయాన్నే విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. విశేష సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు గ్రామస్తులు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. అదే విధంగా చిట్రెడ్డిపల్లి వద్దగల హరేరామా హరేకృష్ణా మందిరంలో జరిగిన కార్యక్రమాలతో ఆ ప్రాంతం శ్రీకృష్ణుని నామంతో మార్మోగింది. ఆలయంలోని ధ్వజస్తంభంపై నెయ్యితో అఖండ జ్యోతిని వెలిగించారు. అంతే కాకుండా పలు గ్రామాల్లో గల ఆలయాల్లో స్వామివారు పూజలందుకొన్నాడు.

## మెట్లెక్కి స్వామిని చూసి...!

తన్మయత్వం పొందిన భక్తులు



**రాజనాలబండ(చౌడేపల్లి), ఆగస్టు 16 ప్రభాతవార్త**

యేడాదికొకసారి స్వామిని చూసేందుకు అడవిదారిన మెట్లెక్కి వెళ్ళి తన్మయత్వంతో భక్తులు ముగ్దులయ్యారు. శ్రావణమాసం ఆఖరి శనివారం రాజనాలంబండ భక్త జనసంద్రమైంది. బండపై వున్న ప్రసన్న ఆంజనేయస్వామికి విశేష పూజలు చేసుకొన్న తర్వాత నరసింహస్వామి కొండకు భక్తులు క్యూకట్టారు. ఉదయాన్నే ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం రాజనాలబండకు సమీపంలోని కొండపై వున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి శ్రావణమాస పూజలందుకొన్నారు. దీంతో బండపై తిరుణాళ్ళ శోభ మొదలైంది. భక్తులు తెచ్చిన నెయ్యితో కొండపైగల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ముందున్న పెద్దరాతిబండపై అఖండలాన్ని వెలిగించారు. రాత్రంతా ఆ దీపం వెలుగుతుండటం స్వామివారి మహిమకు అద్దం పట్టింది. టిటిడి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో సిబ్బంది, రాజనాలబండ యూత్‌చే భక్తులకు పలు సేవా కార్యక్రమాలు జరిగాయి.

## విధినిర్వహణలో ఉత్తమ సేవలకు ప్రశంసలు



చంద్రగిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త:
విధినిర్వహణలో ఉత్తమ సేవలందించిన వివిధ విభాగాల అధికారులకు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందజేసి అభిందించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ టి.స్వర్ణలత, రెవెన్యూ విభాగంలో మండల సర్వేయర్ విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబు, ఎన్టీఆర్ వైద్యసేవ విభాగంలో వైద్యమిత్రగా విశిష్ట సేవలందించిన తూకివాకం మానసలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వి.హర్షవర్ధన్ అభినందిస్తూ ప్రశంసాపత్రం అందజేశారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, నారావారిపల్లి సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, వైద్య సిబ్బంది, అధికారులు వీరికి అభినందనలు తెలిపారు.

## భక్తిసాగరంలో నగరసంకీర్తన

గోవిందనామాలతో ప్రతిధ్వనింపు



తిరుపతి రవాణ,ఆగస్ట్ 16ప్రభాతవార్త
శ్రీకృష్ణాష్టమి పర్వదినాన శనివారం ఉదయం ఆధ్యాత్మికనగరం తిరుపతి హరేకృష్ణ..హరేరామ. గోవిందా గోవిందనామస్మరణతో ప్రతి ధ్వనించింది. తిరుపతి ప్రజల్లో భక్తిభావం పెంపొందింపజేసేందుకు ప్రతి శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చేస్తోంది. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపినాథరెడ్డి, కళాకారులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మునినాథరెడ్డి, కస్పాపద్మనాభమ్, శాంభోలుహరి, విక్రమ్‌స్వామి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, మేకల గంగయ్య, సురేంద్రరాజు, పద్మావతి, జయమ్మ, కళ . విగ్రహాల కల్యాణి, మురళీరెడ్డి, వందమంది కళాకారులు తిరునామం ధరించి తప్పెటతాళాలతో భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## ఉత్తమసేవలకు అవార్డులు ప్రదానం

తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో భక్తులకు సేవలందిస్తున్న పలువురు అధికారులకు వెండి డాలర్లు ప్రదానం చేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ ఏఏఈఓ రాజశేఖర్, ఏఏఈఓ కమ్యూనికేషన్స్ దిలీప్‌కుమార్, అదనపు ఈఓ సిసి ఆదిత్య అందుకున్నారు.



## భక్తులకు భక్తితో సేవలందించండి



తమిళనాడు చెన్నైలోని శ్రీవారి ఆలయం, పద్మావతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన టిటిడిఛైర్మన్ బిఆర్‌నాయుడు.ఆలయాల్లో సేవలు, భక్తులకు దర్శనం వివరాలు తెలుసుకున్నారు.

## గోవులను రక్షించుకుందాం

తిరుపతి,ఆగస్ట్ 16ప్రభాతవార్త:
భక్తుల భాగస్వామ్యంతో గోవులను రక్షించుకుందామని, సంస్కృతిని కాపాడుకుందామని టిటిడి ఈఓ జె.శ్యామలరావు పిలుపునిచ్చారు. వేదాలు,పురాణాల్లో సకలదేవతాస్వరూపాలైన గోవులను భక్తుల భాగస్వామ్యంతో రక్షించుకోవడం ద్వారా భారతీయ హైందవ సంస్కృతిని కాపాడుకుందామని అన్నారు. గోకులాష్టమి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం ఎస్వీగోశాలలో గోవులకు పూజలు చేసి వాటికి దాణా,పచ్చిగడ్డి తినిపించారు.





## సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు

తిరుపతి,ఆగస్ట్ 16ప్రభాతవార్త:
కపిలతీర్థంలోని సుబ్రమణ్యస్వామి ఉత్సవర్లకు ఆలయ అర్చకులు శనివారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆడికృత్తిక సందర్భంగా వేడుకలు జరిగాయి.

కోలాహలంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం

## సంప్రదయ నృత్యాలతో కళ కళ



శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలో శనివారం గోకులాష్టమిని కోలాహలంగా కన్నుల పండువగా యాదవసంఘం నిర్వహించింది. ఏరియా ఆసుపత్రికి సమీపంలోని శ్రీకృష్ణుని మందిరంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆలయాన్ని పూల ముస్తాబులతో ముంచెత్తారు. భక్తి శ్రద్దలతో శ్రీకృష్ణుని విగ్రహానికి ముస్తాబు చేసారు. అభిషేకాలు నిర్వహించారు. శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని రథంపై ప్రతిష్టించి ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని యాదవులు హాజరు కాగా ఉత్సవం ఏరియా ఆసుపత్రి నుంచి చెన్నై రోడ్డు మున్సిపల్ రోడ్డు,పాతవరదయ్యపాళెం రోడ్డు,జయరామారావు వీధి,బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధుల మీదుగా సాగింది కోలాటాలు,మరి కొందరు భజనలు సంప్రదాయ నృత్యాలతో సందడి చేసారు. కార్యక్రమం కృష్ణమందిరానికి చెందిన ప్రముఖులు డాక్టర్ చంద్రయ్య, చెంచురత్నం యాదవ్, కామేస్‌యాదవ్, వెంకయ్యయాదవ్, రాజేష్ యాదవ్, దశరథయ్య యాదవ్, మణియాదవ్, కయ్యాల చంద్రయాదవ్, నారాయణయాదవ్,మునిరాజాయాదవ్,చిర్రినాగేశ్వరరావు, బాలు, జయరామయ్య, దశరథయ్య, మణి యాదవ్,రిటైర్డ్ ఎంఇఓ వంశీకృష్ణ, డాక్టర్ చైతన్య యాదవ్, జగదీష్‌యాదవ్‌లు పర్యవేక్షణలో సాగింది.

***దర్శనం చేసుకున్న మాజీ ఎంఎల్‌ఏ:***
గోకులాష్టమి సందర్భంగా ఎస్‌డికె నగర్‌లో వెలసిన కృష్ణమందిరంలో వెలసిన శ్రీకృష్ణుని మాజీ శాసన సభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వైకాపా నాయకులు దర్శించుకున్నారు. వారికి కమిటి తరపున సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

## వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి కంఠా

శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తికి చెందిన మాజీ కౌన్సిలర్ ప్రస్తుతం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డితో కలసి నడుస్తున్న కంఠా ఉదయ్‌కుమార్‌ను రాష్ట్రయువజన విభాగం కార్యదర్శిగా నియమిస్తూ పార్టీఅధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారి చేసారు.ఈ మేరకు శనివారం పార్టీ కార్యలయంలో ఆయన్ను మధుసూధనరెడ్డి సత్కరించారు. 2014 మున్సిపల్ ఎన్నికల్లో కంఠాఉదయ్‌కుమార్ ఇండిపెండెంటుగా పోటీ చేసి గెలుపొందారు. ఈ సన్మాన కార్యక్రమాల్లో మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, పగడాల రాజు, సిరాజ్, కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి, మున్నరాయల్, సుందరరామెడ్డి, పఠాన్ ఫరీద్, సురేష్, పసల కృష్ణయ్య, శంకర్ ప్రసాద్, సాగిరాబీ,ఫజల్, అర్కాట్ శంకర్,ముత్తు, కోళ్ళూరు హరినాయుడు,కంచి గురవయ్య, ఆరిఫ్, వయ్యాల మనోహర్‌రెడ్డి, లీలా కుమార్,యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



## బిక్షాల గాలిగోపురం వద్ద అన్నదానం



శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త
మాజీ కౌన్సిలర్ తెలుగుదేశం పార్టీలో ఆది నుంచి కీలకంగా వ్యవహరిస్తున్న బీమాల మునికృష్ణయ్య జన్మదిన వేడుకలను బొజ్జల బృందమ్మ సారధ్యంలో భారీ ఎత్తున కార్యకర్తల మధ్యకేక్ కట్ చేయించారు. అలాగే పట్టణ నడిబొడ్డులోని బిక్షాల గాలిగోపురం వద్ద ఉన్న వాహనాల మండపం వద్ద వేలాది మంది పేదలకు అన్నదానం జరిపారు.ఈ కార్యక్రమాల్లో బొజ్జల బృందమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకునికి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పట్టణ వైయస్ఆర్‌సిపి విద్యార్థి విభాగానికి చెందిన యువనాయకుడు చందు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్, వైకాపా మండల నాయకుడు వయ్యాల కృష్ణారెడ్డి సారధ్యంలో కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి మండల ఉపాధ్యక్షులు మామిళ్ళ పల్లి వెంకటేష్‌నాయుడు,వయ్యాల మనోహర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శివరామిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అంకయ్య, పసల కృష్ణయ్య,,రాజారెడ్డి,యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణం వందే జగద్గురుం.....

రేణిగుంట ఆగస్టు 16 ప్రభాతవార్త



మండలంలోని అన్ని కృష్ణ మందిరాలు శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం కృష్ణ నామస్మరణతో మారుమోగాయి. రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో తిరుపతి ఇస్కాన్ అవుట్ పోస్ట్ రేణిగుంట ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించి భక్తులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. శ్రీ కృష్ణయ్యకు ఇస్కాన్ సభ్యులు అభిషేకాలు, ప్రత్యేక హారతులు, కీర్తనలు భజనలు, ప్రసాదాల వితరణ చేశారు. రేణిగుంట మండలం జి పాలెం కృష్ణ మందిరం నందు అంబేద్కర్ స్టార్ కృష్ణ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. రేణిగుంట బస్టాండ్ సెంటర్లో ఆడికృత్తిక, గోకులాష్టమి పర్వదినాలను పురస్కరించుకొని యాదవ సంఘం, భారతీయ మద్దూరు సంఘం నేతలు సంయుక్తంగా అన్న సంతర్పణ చేశారు. ఈ సందర్భంగా యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ పురాణ పురుషుడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర్ రెడ్డి, తూకివాకం మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవళ్ళ రమణ, తెలుగుదేశం పార్టీ రేణిగుంట మండల మాజీ ఎస్సీ సెల్ కన్వీనర్ నెల్లూరు సుబ్రమణ్యం, చందు, వంశి, రాజ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి వాహన చక్రాలు రోడ్డుపై పరుగులు...

మహిళలకు ఉచిత బస్సు ప్రారంభం..



రేణిగుంట ఆగస్టు 16 ప్రభాతవార్త
తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా స్త్రీ శక్తి పథకం అమల్లోకి రావడంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం ఆర్ మల్లవరం గ్రామ జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచనలతో టిడిపి నేతలు మహిళల ఉచిత బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బొబ్బిలి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలకు కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్లు, పెంచిన పింఛన్ల పంపిణీ, తల్లికి వందనం, తదితర పథకాలు అమల్లోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు డాక్టర్ డి కోదండరామిరెడ్డి, ఎం శంకర్ రెడ్డి, క్రాంతి కుమార్, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎం రాజేష్, ఎం రమేష్, మస్తాన్ మహిళా ప్రయాణికులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలను పనులకు పంపితే నేరం...

అర్బన్ ఎస్పై నాగరాజు



రేణిగుంట ఆగస్టు 16 ప్రభాతవార్త
బడి ఈడు పిల్లలను బడులు మానిపించి పనులకు పంపడం, పనుల్లో చేర్చుకోవడం నేరమని రేణిగుంట అర్బన్ ఎస్పై నాగరాజు అన్నారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లె ఎస్టీ కాలనీ, నీలాద్రి కాలనీలలో శనివారం సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ (సిర్డ్స్) ఆధ్వర్యంలో దూరమేన్ ఆర్థిక సహాయంతో పేద పిల్లలకు విద్యాభ్యాస సామాగ్రిని రేణిగుంట అర్బన్ పోలీసులు చేతుల మీదగా పంపిణీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఎన్నో పథకాలను అమల్లోకి తెచ్చిందన్నారు. చిన్నారులు పనులకు వెళ్లకుండా బడులకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో రాస్ చైల్డ్ ఫండ్ ఇండియా డైరెక్టర్ రమేష్ రెడ్డి, సిర్డ్స్ వ్యవస్థాపకులు మరుపూడి సోమశేఖర్, ట్రైన్ ఎస్పై స్వాతి, మహిళా పోలీస్ తేజస్విని, సంస్థ కోఆర్డినేటర్ తేజ, ఉపాధ్యాయులు రేఖ, స్వాతి, పిల్లల తల్లితండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుని కృప అందరిపై ఉండాలని కోరుకున్నా.

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి విద్య, ఆగస్టు 16 ప్రభాత వార్త:
శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఇస్కాన్ లోని రాధా కృష్ణ సమేత అష్టసతులను ఎమ్మెల్యే ఆరణ శ్రీనివాసులు శనివారం ఉదయం దర్శించుకున్నారు.ఆలయ ప్రతినిధులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.గోకులాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ పరమాత్మున్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి నియోజకవర్గ ప్రజలందరిపై శ్రీకృష్ణుని కృపాకటాక్షాలు మెండుగా ఉండాలని ఆకాంక్షించినట్లు ఆయన తెలిపారు. ఆరణి జగన్,రాజా రెడ్డి, జీవకోన సుధా,బాబ్జీ, రాజేష్ ఆచ్చారీ, మునస్వామి,పురుషోత్తం,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## గోవు హిందువులకు ఎంతో పవిత్రమైనది.

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు.



తిరుపతి విద్య, ఆగస్టు 16 ప్రభాతవార్త:
ఎస్వీ గోసంరక్షణశాలలో గోకులాష్టమి సందర్భంగా గోపూజ మహోత్సవం సాంప్రదాయబద్దంగా జరిగింది.ఈ పూజలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని వేణుగోపాల స్వామిని దర్శించి గోవులకు ఆహారం తినిపించారు. ప్రస్తుతం గోశాలలో 2,789 గోవులు ఉన్నట్లు ఆయన చెప్పారు. పిండ మార్పిడి విధానం ద్వార మేలు రకమైన దేశియ ఆవుల ఉత్పత్తికి శ్రీవేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంతో ఒప్పందం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. పిండ మార్పిడి విధానంలో 47 సాహివాల్ జాతీయ ఆవు దూడలు జన్మించినట్లు ఆయన తెలిపారు. గోశాలలోని పశువులకు మేలైన దాణా అందించేందుకు వెటర్నరీ యూనివర్సిటీ ఫీడ్ ప్లాంట్ ద్వారా దాణ తయారి మెరుగు పరిచినట్లు ఆయన చెప్పారు. గోవుల ఆరోగ్య పరిరక్షణకు వెటర్నరీ యూనివర్సిటీ నిపుణల సూచనల మేరకు ఎక్స్ పర్ట్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అలాగే ఎన్ డిడిబి నుంచి సహాయ సహకారాలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అలాగే గోశాల కొనుగోళ్ళ పరిశీలనకు ఫైనాన్సిల్ అడ్వైజర్, గోశాల డైరక్టర్, ప్రొక్యూర్ మెంట్ జనరల్ మేనేజర్ తో కమిటీ వేసినట్లు ఆయన తెలిపారు. దేశవాలి ఆవుల సంరక్షణ కోసం గోశాలలో 46 కోట్లతో చేపట్టిన ఎన్ డిడిబి సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ అక్టోబర్ నెలలో నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు. దాతల సాయంతో ఐదు వందల గోవులను తీసుకోవాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అలాగే వంద లీటర్ల దేశవాలి ఆవు నెయ్యి తయారి కోసం నిర్మిస్తున్న ప్రత్యక కేంద్రం త్వరలో అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు రాజా రెడ్డి, నైనార్ శ్రీనివాస్,ఎల్ బి నగర్ బాల,బాబ్జి, ఆళ్వార్ మురళీ,రాజేష్ ఆచ్చారి,శిరీష, మునస్వామి,పూసా మాధవ రావు,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పాకాల, ఆగస్టు 16, ప్రభాతవార్త
పాకాల మండలం శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా భక్తి శ్రద్ధలతో శనివారం జరుపు కున్నారు. రుత్వికులు అభిషేకం, పూజ కార్యక్రమాలు, ఆశీర్వచనానంతరం తిరుపతి ప్రభువులు సహకారంతో సత్సంగం జరిగినది. ప్రసంగం నందు భగవద్గీత విశిష్టత తెలియజేశారు. భాగవతం పారాయణం చేయమని, శ్రీ కృష్ణ లీలలు తెలియజేశారు. మందిరం అభివృద్ధికి విరాళాలు అందించిన సభ్యులకు సన్మానం. అనంతరం గోపికల అలంకరణతో బృందం కోలాటం కార్యక్రమం కనులు పండుగగా, ఆహ్లాదంగా జరిగినది. సంపూర్ణ ప్రసాదం వితరణ గావించి వేడుకలు సంపూర్ణం గావించారు.



## మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

వడమాలపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త:
మహిళల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయలునాయుడు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభమైన సందర్భంగా శనివారం బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలకు స్వీట్లు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చిత్రపటాలకు పాలాబిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఉచితంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణించే అవకాశం ప్రభుత్వం కల్పించడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దాముయాదవ్, నాయకులు లక్ష్మీప్రసన్న, హేమావతి,రాధాకృష్ణ, గురునాథం బాబు, ఆదినారాయణ, వినోద్, చందు, గుణశేఖర్‌రాజు పాల్గొన్నార





## స్విమ్స్‌కు రూ.లక్ష విరాళం

తిరుపతి హెల్త్, ఆగష్టు 16 ప్రభాతవార్త :
స్విమ్స్ ఆస్పత్రి శ్రీబాలాజీ ఆరోగ్య ప్రసాదిని పథకానికి తిరుపతి నగరానికి చెందిన హెచ్‌సీఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా విధులు నిర్వహిస్తున్న వి. రజనీ కుమారి భర్త ఎం.విఆర్ ప్రసాద్ స్విమ్స్ వారు పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలకు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. చెక్కు రూపంలో శనివారం ఉదయం తన సోదరి స్విమ్స్ ఉద్యోగి సూపరింటెండెంట్ ధనలక్ష్మి ద్వారా స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్, డాక్టర్ల బృందం దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## కొత్తూరులో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

-వైభవంగా కళ్యాణోత్సవం



తిరుపతిరూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ చిగురువాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరులో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తూరులోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ దేవాలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని శనివారం ఉదయం 6:30గంటలకు శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, కళ్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఉట్లోత్సవం, గ్రామ ఊరేగింపు చేసారు. రుక్మిణి, సత్యభామలతో శ్రీకృష్ణుడి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిపి వార్తాల రాధ, వార్తాల శ్రీనివాస్ యాదవ్, వార్తాల శివ యాదవ్, వార్తాల వెంకట్రామయ్య యాదవ్, మురళి యాదవ్, భాస్కర్ యాదవ్, నాగరాజు, ఎద్దర భాస్కర్, మల్లీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీబాల జ్ఞాన దండాయుధపాణి స్వామిని దర్శించుకున్న తుడ చైర్మెన్



తిరుపతిరూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:
ఆడికృతిక పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీబాలజ్ఞాన దండాయుధపాణి స్వామిని తుడ చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తిరుపతిరూరల్ మండలం తనపల్లి గ్రామ పంచాయతీలో పద్మగిరి కొండపై శ్రీబాల జ్ఞాన దండాయుధపాణి స్వామి వెలసిన విషయం తెల్సిందే. తుడ చైర్మెన్, టిటిడి పాలకమండలి సభ్యుడు డాలర్ దివాకర్ రెడ్డి పట్టువస్త్రాలతో సారె సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు తుడ చైర్మెన్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసారు.

## శ్రీబాల జ్ఞాన దండాయుధపాణి స్వామిని దర్శించుకున్న మోహిత్‌రెడ్డి

పద్మగిరి కొండపై వెలసిన శ్రీబాల జ్ఞానదండాయుధపాణి స్వామిని శనివారం తుడ మాజీ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామికి సారె సమర్పించి, ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మునీశ్వరరెడ్డి, మాధవరెడ్డి, చిలమంద మునికృష్ణ, చిన్నియాదవ్, అవిలాల లోకనాథరెడ్డి, భాను, వినోద్, అభి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీబాల జ్ఞాన దండాయుధపాణి స్వామిని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, అనిమినేని మధు, కత్తి సుధాకర్, బాలచంద్రారెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

## హరోం..హర నామంతో భక్తుల ఆడికృత్తిక పూజలు



నారాయణవనం, ఆగస్టు 16 ప్రభాతవార్త :
ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకొని శనివారం భక్తులు తమతమ ఇళ్లలను శుద్ది చేసిన తర్వాత సుబ్రమణ్యస్వామికి పూజలను నిర్వహించారు. హరోం హర నామంతో సుబ్రమణ్యంస్వామి ఆలయాలు పులకించింది. అంతేకాకుండా మొక్కుబడి కలిగిన వందలాది మంది భక్తులు హరోం..హర నామంతో కావళ్లతో తిరుత్తణికి బయలుదేరారు. అలాగే కైలాసనాథకోనలో వెలసిన బాలసుబ్రమణ్యంస్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## వాడవాడలా ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

నారాయణవనం, ఆగస్టు 16 ప్రభాతవార్త :
శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని శనివారం మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగింది. ఉదయం యాదవ కులస్తుల ఆధ్వర్యంలో గోపూజ చేసిన తర్వాత ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం ఎదుట భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి 7గంటలకు గ్రామవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. అలాగే భీమునిచెరువు, నారాయణవనం, తుంబూరు, గోవిందప్పనాయుడుకండ్రిగ, పాలమంగళంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భీమునిచెరువులో వేణుగోపాలున్ని రాత్రి గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు.



## టిటిడి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

నారాయణవనం, ఆగస్టు 16 ప్రభాతవార్త :
మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయాన్ని శుద్ది చేసిన తర్వాత శ్రీకృష్ణున్ని తిరుచ్చివాహంపై అధిరోహించి గ్రామవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారు ఊరేగింపు సమయంలో భక్తులు టెంకాయహారతులు పట్టారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి, శ్రీకృష్ణుడు సమేత శ్రీకళ్యాణవేంకటేశ్వరున్ని మాడవీధుల్లో తిరుచ్చివాహనంపై ఊరేగించారు. అనంతరం ఉట్లోత్సవం ఘనంగా జరిగింది. ఉట్టును కొట్టడానికి యువత పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, సిబ్బంది భరత్, కైలాసం, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాడవాడలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పుత్తూరు రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:
పుత్తూరు మున్సిపల్ పరిధిలోని ముత్తురాసి కండ్రిగ గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విఘ్నేశ్వర పూజ కలశస్థాపన కలశ పూజ నవగ్రహ హోమం ప్రత్యేక హోమాలు నిర్వహించి అనంతరం కృష్ణ భగవానుడికి కల్యాణ ఉత్సవాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్న పిల్లలు శ్రీకృష్ణుడు సత్యభామ వేషధారణ భక్తులను ఆకట్టుకుంది. అలాగే మండల పరిధిలోని వేపగుంట గొల్లపల్లి తిరుమలకుప్పం తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో వెలసిన గీతామందిరంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు చేశారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు

పుత్తూరు రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:
పుత్తూరు పట్టణ మండలపరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఆడికృత్తిక సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక అభిషే కాలు, పంచామృతాభిషేకాలు చేశారు. పట్టణం లోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శివాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మండల పరిధిలోని సిరుగురాజుపాళెం గ్రామంలో వెలసిన మలేషియా మురుగన్ ఆలయంలోకూడా అభిషేకాలు, అలంకరణలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పసుపు బట్టలు ధరించి కావళ్ళతో మొక్కులు తీర్చుకున్నారు.



## ఆక్రమణల చెరలో గాంధీజీ...

రేణిగుంట ఆగస్టు 16 ప్రభాతవార్త



రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి అహింసాని ఆయుధంతో భారతమాత దాస్య శృంకలాలు విడిపించి దేశానికి స్వాతంత్రం తెచ్చిన జాతిపిత విగ్రహం ప్రస్తుతం రేణిగుంట నడిబొడ్డులో ఆక్రమణదారుల చెరలో బందీగా మారి పోయింది. గాంధీ విగ్రహం చుట్టూ అంగళ్ల వ్యాపించడంతో ఆయన దర్శన భాగ్యమే కరువైంది. ఆక్రమణలపై రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విఆర్ రావణన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ జయంతి వర్ధంతి, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలు, ప్రముఖులు రేణిగుంటకు వచ్చినప్పుడు గాంధీ విగ్రహానికి మాలవేసి నివాళులు అర్పించడానికి వీలు లేకుండా పోయిందని విరుచుకుపడ్డారు. పంచాయితీ సర్పంచ్, కార్యదర్శి, స్థానిక పోలీసులు కలగజేసుకొని గాంధీ విగ్రహాన్ని చెర నుండి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. అహింసా వాది, బోసి నవ్వులు చిందించేవారు, చాలా కాలం వెలుగు లేక చీకట్లో మగ్గిన వారు, చేతిలో కర్ర ఉన్నా ఊతంకోసం పట్టుకున్నాడు తప్ప ఎవరిని దండించడానికి కాదులే, ఆయనేం చేస్తాడు అని భావిస్తున్నారేమో ఆక్రమణదారులు.రోజు ఆయన బొమ్మలేని కరెన్సీ నోటు లేకపోతే ఏది జరగదు అన్న విషయం గుర్తుంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గాంధీజీకి చెర విడిపిస్తారో లేదో వేచి చూడాలి.....





# పార్టీలో పనిచేసే వారికే సముచిత స్థానం

చిల్లకూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసిన వారికే సముచిత స్థానం ఉంటుందని గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. శనివారం చిల్లకూరు గ్రామంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న జ్యోతి వే బ్రిడ్జి వద్ద సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బల్లవోలు గ్రామంలో గత తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప మరొకటి లేదన్నారు నియోజకవర్గంలో మొదటిసారిగా చిల్లకూరు మండలంలోని బల్లవోలు గ్రామపంచాయతీ నుండి చాకిరి యశ్వంత్‌తో పాటు వారి అభిమానులు 300 మంది తెలుగుదేశం పార్టీ కండువా చేసుకోవడం జరిగింది అని వారు తెలిపారు. అదే విధంగా ఆ గ్రామంలో మొదటి నుండి పార్టీ కోసం పని చేసిన దువ్వూరు వినయ్ కుమార్‌రెడ్డి చాకిరి యశ్వంతలు కలిసికట్టుగా పనిచేసే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఎక్కడ కూడా విభేదాలకి తావు లేకుండా పనిచేయాలన్నారు. అనంతరం నూతనంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేని ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీని పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సెలవ పూల మాలతో సన్మానించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత తానంకి నానాజీ, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, చిన్నకూరు పట్టాభిరామిరెడ్డి, పెనుబోలు జానకిరామిరెడ్డి, సూరనేని రామచంద్ర రావు, ఓడూరు సత్యనారాయణ రెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, కోట సతీష్ యాదవ్, మేఘనూరు వెంకటకృష్ణయ్య, ఒబ్బయ్య శివకుమార్, మేకల కుమార్, గుండా లీలావతి, చెరుకూరు పద్మజ, కొండ రామచంద్రారెడ్డి, మూగశంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## నరకాన్ని చూపిస్తున్న విద్యానగర్ రోడ్లు



కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త: విద్యానగర్ నుంచి గూడలికి వెళ్లే ఆర్అండ్‌బి రహదారి గుంతలతో అస్త వ్యస్థంగా మారింది. దీంతో ఇటుగా వెళ్లే ద్విచక్ర వాహన దారులు, నడకదారిలో వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షానికి నీళ్ల గుంతలో చేరడంతో వాటి లోతు తెలియక అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మరోపక్క అధికారంలోకి వచ్చాం, రోడ్లు బాగు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకులకు విద్యానగర్‌లో రోడ్లు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా కూటమి నాయకులు ఈ రోడ్లు గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాగు చేయాలని కోరుతున్నారు.

## విగ్రహాలకు అనుమతి తప్పనిసరి : సీఐ

సూళ్లూరుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో గణేశ్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వినాయక విగ్రహాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరి అని సీఐ మాకినేని మురళీకృష్ణ వెల్లడించారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో వినాయక మండపాల నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి ఐదు లేక అంతకంటే ఎక్కువమంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి సంబంధిత వారి వివరాలు పోలీసుస్టేషన్‌లో తెలియ జేయాలన్నారు. వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకున్న స్థలానికి చెందిన యజమాని సంబంధిత విభాగపు అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ, విద్యుత్ అధికారుల అనుమతులు తీసుకుని నిబంధనల ప్రకారం మండపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి వేళ మండపం వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలని సూచించారు. అధిక సౌండ్ రాకుండా సాంకేతికంగా ఉండే స్పీకర్లు ఉపయోగించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు, ట్రైనింగ్ ఎస్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



దొరవారి సత్రం,ఆగస్టు 16 ప్రభాతవార్త: మండల పరిధిలోని అక్కరపాక తదితర ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు కృష్ణాష్టమి వేడుకలు ముఖ్యంగా ఉట్టి కార్యక్రమం లో యువకులు చిన్నపిల్లలు పెద్దలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు జయప్రదంగా

## యువకుడు ఆత్మహత్య!

కోట,ఆగస్టు 16 ప్రభాతవార్త : మండలంలోని కేశవరం గ్రామ పంచాయతీలోని పరిధిలోని కొడుగుంట గ్రామానికి చెందిన శ్రీకాంత్ (28) కుటుంబ కలహాలతో గత నెల 25న ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నంకు పాల్పబడ్డాడు. ఆ మేరకు కుటుంబ సభ్యులు తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్న క్రమంలో శనివారం మృతి చెందారని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. మృతుడు మద్యం సేవించి తల్లిదండ్రులతో ఘర్షణ పడ్డారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ. పవన్ కుమార్ తెలిపారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త: కోట మండలం తిన్నెలపూడి, కోటలోని చిన్మయ మిషన్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తిన్నెలపూడిలోని శ్రీకృష్ణమందిరంలో వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున స్వామికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శ్రీకృష్ణాష్టమి లీలల గురించి భక్తులకు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కోటలోని చిన్మయ మిషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కోటలో వర్షం

కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త : మండలంలో శుక్రవారం నుండి ఒక్కసారిగా భారీవర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయం అయ్యాయి. కోట నుంచి విద్యానగర్‌కు ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వర్షంతో విద్యానగర్‌లోని పలు వీధులు జలమయం అయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## సూళ్లూరుపేటలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి



సూళ్లూరుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని సూళ్లూరుపేటలో ఘనంగా నిర్వహించారు. శనివారం పర్వదినం సందర్భంగా శ్రీ పాండురంగ దేవస్థానం, ప్రసన్న వెంకటేశ్వర దేవస్థానం, శ్రీ మద్వేంకట రామ్మూర్తి దేవస్థానంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. వేణుగోపాల కృష్ణమందిరంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శ్రీ మద్వేంకట రామ్మూర్తి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వరస్వామికి కృష్ణాలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కన్నెరివీధిలోను, స్వాతంత్య పురంలోను కృష్ణాష్టమి వేడుకలు యాదవవంశస్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో పలుచోట్ల ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు. వైష్ణవాలయాలన్నీ భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో గల యశోద రెసిడెన్సిలో ప్రజాహిత బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

## కెజెఆర్ ఛారిటబుల్ సంస్థచే వైద్య పరికరాలు



సూళ్లూరుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త: మండల పరిధిలోని కోటపోలూరు గ్రామానికి చెందిన కోగిలి జయరామిరెడ్డి సేవాసంస్థ వారు శనివారం ప్రభుత్వాసుపత్రికి ఉపయోగపడే వైద్య పరికరాలను అందజేశారు. సంస్థ చైర్మన్ కోగిలి సురేష్ రెడ్డి చేతులు మీదుగా ఈ పరికరాలను డాక్టర్ సయ్యద్ ఖాదరీబాషాకు అందజేశారు. ప్రభుత్వ వైద్యశాలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేసే ఆక్సీజన్ కాన్సంట్రేటర్, టిపి స్టాండ్ మిషన్, మాన్యువల్ బిపి మిషన్, శతస్కోపులు, ఆటోమేటిక్ బిపి మిషన్లు, ఐవి కెనాల్ ఆరోగ్య పరికరాలను అందజేశారు. సుమారు రూ.90 వేలు వరకు ప్రభుత్వాసుపత్రికి సంస్థ ఆధ్వర్యంలో ఈ సాయం అందజేశారు. ఈ పరికరాలను అందజేసిన కోగిలి జయరామిరెడ్డి సేవాసంస్థ చైర్మన్ సురేష్‌రెడ్డిని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాక్షాయణి, హెడ్ నర్సు లక్ష్మీకుమారి, సంస్థ సభ్యులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, నారపరెడ్డి ఉదయ్‌కుమార్, జెట్టి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు





గూడూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త : పట్టణంలోని రాజా వీధిలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు చిన్ని కృష్ణుడికి అభిషేకం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. గూడూరులోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణుల వారికి విశేష అలంకరణ ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం పట్టణ పురవీధుల్లో స్వామి శ్రీకృష్ణ పాండవుల వేషధారణ రథం ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మార్గ మధ్యలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ రథం ఎక్కి ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శిగా సుధాకర్



కోట,ఆగస్టు, 16 ప్రభాతవార్త : మండలంలోని విద్యానగర్ చెందిన బిఎస్‌పి నాయకుడు సుధాకర్‌ను బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర బిఎస్‌పి అధ్యక్షులు గౌతమ్‌కుమార్ నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల నాయకులు ఆయన నియామకం పై హర్షం వ్యక్తం చేశారు.

## రేస్ స్కూల్ లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు




చిల్లకూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త : మండలంలోని చింతవరంలో వున్న రేస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ను ఎంతో ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు గోపిక, శ్రీకృష్ణుడు వేషధారణలో అలరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యల్లసిరి బాలచెన్నయ్య మాట్లాడుతూ శ్రీకృష్ణుడు గొప్ప విలువలు కలవాడని, భగవద్గీత ద్వారా ఈ ప్రపంచానికి ఒక గొప్ప సందేశం ఇచ్చాడని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ గుమ్మడి వెంకట సుబ్బయ్య, కరస్పాండెంట్ యల్లసిరి బాలచెన్నయ్య, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పల సరుకులు పంపిణీ



గూడూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త: గూడూరు టౌన్, వెస్ట్ క్లబ్స్ సేవ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ప్రతి నెల ఇచ్చే విధంగా వృద్ధులు కు పల సరుకులును అందించారు. ఇమ్మీడియేట్ పాస్ట్ జోన్ చైర్మన్ వై. గురునాధం మనవడు వాసు పుట్టినరోజు సందర్భంగా వృద్ధులుకు పలసరుకులను అంద జేసారు. లయన్స్ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటు సభ్యులుతో కో ఆర్డినేషన్ చేస్తునందుకు టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ ఎం. శ్రీనివాస్ యాదవ్‌కి, ఉచిత కుట్టు శిక్షణలో మహిళల మన్ననలను పొందిన ట్రైనర్ లయన్ లేడీ ఐ కావేరికి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంజెఎఫ్.లయన్. ఆర్‌వి రావు, వైజేపీ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ సుధాకర్, వెస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ ఎం. జయ చంద్రరెడ్డి, ట్రెజరర్ పి.గోపినాథ్ రెడ్డి, క్లబ్ సభ్యులు పాస్ట్ జోన్ చైర్మన్ ఎంజెఎఫ్ లయన్, పి.మురళి నాయుడు, ఇమ్మీడియేట్ పాస్ట్ జోన్ చైర్మన్ ఎంజెఎఫ్ లయన్, పి.గురునాధం, పర్మినెంట్ ప్రాజెక్ట్ చైర్మన్ లయన్ వి.చంద్ర శేఖర్‌రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ ఎస్ఎల్ఎన్ స్వామి, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ డి.రవీంద్రరెడ్డి, లయన్ బాబు రావు,లయన్ బి, హరికృష్ణ, లయన్ భాస్కర్‌రెడ్డి, లయన్ ఇంతియాజ్, లయన్ లేడీ వి. హైమావతిలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

## 21న గూడూరులో జాబ్ మేళా

గూడూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త : పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యూ కళాశాల నందు మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ముందంజలో ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు నిరంతరం పనిచేస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఎంతోమందికి స్కిల్స్ నేర్పించి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డబ్ల్యూ కలశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు, జిల్లా నైపుణ్యాధికారి లోకనాదం, ప్లేస్‌మెంట్ అధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌కి ప్రశంస పత్రం




గూడూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త: మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఏ వెంకటేశ్వర్లుకి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ ఎన్ వెంకటేశ్వర్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గూడూరు కమిషనర్‌గా ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి ఈ ప్రశంస పత్రం తీసుకోవడం సంతోష్ దాయకంగా ఉందన్నారు.

## ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : డిఎస్‌పి

నాయుడుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త: నాయుడుపేట పట్టణం,గ్రామాల్లో ఈనెల 27వతేదిన నిర్వహించే వినాయకచవితి వేడుకలకు కమిటిసభ్యులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు తెలిపారు. ఆయన శనివారం నాయుడుపేట డివిజనల్ కార్యలయంలో వినాయకచవితి కమిటి సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్‌పి చెంచుబాబు మాట్లడుతూ పట్టణం, గ్రామాల్లో వినాయకచవితి నిర్వహించే కమిటిసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో నాయుడుపేట సిఐ బాబి,ఎస్సై ఆదిలక్ష్మి, పోలీసులు, వినాయకచవితి కమిటి సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు తప్పనిసరి



దొరవారిసత్రం,ఆగష్టు 16ప్రభాతవార్త: ఎవరైనా వినాయక విగ్రహం పెట్టాలనుకుంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు మండల ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. పలు గ్రామాలోని ఆర్గనైజర్స్ తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించిలని ఎటువంటి ఆటంకం లేకుండా వినాయక ఉత్సవాలు సమర్థవంతంగా నిర్వహించుకోవాలని తెలిపారు.

## వరసిద్ధునికి వైభవంగా గ్రామోత్సవం

కాణిపాకం, ఆగస్టు 16 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆడికృత్తిక పండుగ సందర్భంగా శనివారం రాత్రి గణనాధునికి గ్రామోత్సవం నిర్వహించారు. కాణిపాకంకు చెందిన వాయవందలార్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర వ్యహించారు. అలాగే రాత్రి సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులకు తిరిగి గ్రామోత్సవంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసు, ఉభయదారులు, వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీకృష్ణునికి పుష్పయాగం





తొట్టంబేడు,ఆగస్టు 16 ప్రభాతవార్త : తొట్టంబేడు సమీపంలోని చెంచులక్ష్మి కాలనీలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో వెలసిన గోకులాష్టమి సందర్భంగా పుష్పయాగం నిర్వహించారు.ఇక్కడ భక్తుల భాగస్వామ్యంతో చక్కటి శ్రీకృష్ణుని గుడిని నిర్మించారు.ఇక్కడ నిత్య పూజలు,అభిషేకాలు,భజనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పుష్పయాగంను రాత్రి నిర్వహించారు. ఉభయదాతలుగా ఎపిఎన్‌జిఓల సంఘాధ్యక్షులు చల్లా చెంచురత్నం యాదవ్, ఆయన సతీమణి శ్యామలలు హాజరు కాగా సుమారు 200 కిలోల వివిధ రకాల పుష్పాలను తమిళనాడు, కర్నాటకల నుంచి తెప్పించారు. శ్రీకృష్ణుని విగ్రహానికి రప్పించిన పూజలు జరిపారు. ఆలయ అర్చకులు వేదోక్తంగా వేద మంత్రాలు పఠిస్తుండగా హోమాలు నిర్వహించారు. గోవిందనామస్మరణతో పుష్పయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ప్రముఖులు డాక్టర్ చంద్రయ్య, చెంచురత్నం యాదవ్, కామేస్‌యాదవ్, వెంకయ్యయాదవ్, రాజేష్ యాదవ్, దశరథయ్య యాదవ్, మణియాదవ్, కయ్యాల చంద్రయాదవ్, నారాయణ్రయాదవ్, మునిరాజాయాదవ్, చిర్రినాగేశ్వరరావు, బాలు, జయరామయ్య, దశరథయ్య, మణియాదవ్, రిటైర్డ్ ఎంఇఓ వంశీకృష్ణ, డాక్టర్ చైతన్య యాదవ్, జగదీష్‌యాదవ్‌లు పర్యవేక్షలో సాగింది.

## కన్నుల పండువగా పుష్పపల్లకి సేవ



తవణంపల్లె, ఆగస్టు 16 ప్రభాతవార్త: మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయంభువనేశ్వర కుమారస్వామి ఆలయంలో జరిగిన ఆడికృత్తిక ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామివారికి పుష్పపల్లకిసేవను నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు పలు రకాల పూజాధి కార్యక్రమాలు, కావడి చెల్లింపులు నిర్వహించారు. అలాగే రాత్రి గ్రామంలో స్వామి, అమ్మవార్లకు పుష్పపల్లకి సేవను వైభవోపేతంగా నిర్వహించారు. పుష్పపల్లకిపై వుంచి చెక్కభజనలు, కోలాటాలు, నయ్యాండి మేళం, కరగాట్టం వివిధ వేషధారణలు వంటి పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామపురవీదుల గుండా ఘనంగా ఊరేగించారు. నిర్వహకులు నరేష్‌కుమార్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి, అరగొండ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీకృష్ణ పరిణయ మహోత్సవం



చంద్రగిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని శనివారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. అదేవిధంగా స్థానిక ద్వారకా నగర్‌లో వెలసియున్న శ్రీమురళీకృష్ణ దేవాలయంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ పరిణయ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగాతం మునిరామిరెడ్డి, నరశింగాపురం అయ్యప్పస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. చిన్నారులు చిన్ని ృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, కృష్ణమందిరం ఆలయ అధ్యక్షుడు ఓంకార్ భరద్వాజ్, ఆలయ చైర్మన్ రాజులగారి మనోహర్ రెడ్డి, కార్యనిర్వహక అధ్యక్షుడు పి.జనార్ధన్ రెడ్డి, కార్యదర్శి నరశింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా సుబ్రమణ్య స్వామి వారి కళ్యాణోత్సవం



సదుం, ఆగస్టు 16 ప్రభాతవార్త : సదంలోని గార్గేయ నది ఒడ్డున వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి ఆలయంలో జరుగుతున్న ఆడి కృత్తిక ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామివారికి కృత్తిక కావడు లు నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కావడీలతో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని కళ్యాణ మండపంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సేవకు ముందుగా వివిధ రకాల హోమాలు జరిపారు. అనంతరం కళ్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా అన్నదానం ఏర్పాటు చేశారు. చెరుకువారిపల్లె పిహెచ్సి వైద్యులు చరణ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్సిసి విద్యార్థులు సదుం పోలీసులు సేవలందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు వెంకటరమణారెడ్డి, మల్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సహదేవయ్య, సుబ్రహ్మణ్యం, మురళి, శ్రీధర్, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కావడి మొక్కులు చెల్లించిన మంత్రి రోజా



పుత్తూరు రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త: ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మాజీ మంత్రి రోజా కావడి మొక్కులు చెల్లించుకున్నారు. సాంప్రదాయపద్ధతిలో పసుపు చీర ధరించి సుబ్రహ్మణ్యస్వామి ప్రతిమాచరించిన ఆమె పుష్పాలతో అలంకరించిన కావడి ఎత్తారు. రాష్ట్ర సరిహద్దులో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి దర్శించుకుని కావడి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలోకి ప్రవేశించిన ఆమెకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్న అనంతరం మొక్కుబడి చెల్లింపుగా వెండి శూలాయుధాన్ని హుండీలో వేసి మొక్కు చెల్లించుకున్నారు. ఆమెను ఆలయ పురోమితులు ఆశీర్వదించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, నాయకులు రమేష్‌రెడ్డి, మురుగ, ఆనందకుమార్, కృష్ణమూర్తి, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కును ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు



చిత్తూరుహెల్త్, ఆగస్టు 16 ప్రభాతవార్త: చిత్తూరు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడానికి చిత్తూరు-వేలూరు రహదారిలోని కలెక్టరేట్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వెదురారణ్యం పార్కును శనివారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, కలెక్టర్ సుమిత్‌కుమార్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతలు ప్రకృతి పరిరక్షణలో భాగంగా పార్కులో పచ్చదనంను పెంపొందించడానికి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు నూతనంగా ఏర్పాటు చేసిన వెదురారణ్యం పార్కు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతసమయం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు ప్రకృతి ఒడిలో గడిపారు.

## భక్తులకు సుబ్రమణ్యస్వామి అనుగ్రహం కలగాలి

**-టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు**

తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి: తిరుత్తణి శ్రీవల్లీదేవసమేత సుబ్రమణ్యస్వామికి ఆడికృత్తిక సందర్భంగా శనివారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. కావళ్ళతో హరోంహర అంటూ లక్షలాదిమంది భక్తులు తిరుత్తణికి చేరుకుంటున్నారని, వారందరికీ స్వామివారి అనుగ్రహం కలగాలని కోరుకున్నారు. టిటిడి తరపున ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పిఎస్ ప్రసన్నకుమార్‌తో కలసి తిరుత్తణికి వెళ్ళి పట్టువస్త్రాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

## శ్రీకాళహస్తిలో కృత్తిక సంబరాలు



శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త: తమిళనాడులోని తిరుత్తణిలో ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహిస్తుండగా శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో శనివారం ఆడికృత్తికను కృత్తికగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయాన్ని దేవస్థానం ముస్తాబు చేసారు.ఉదయం నుంచి భక్తులు నారదపుష్కరిణిలో తలనీలాలు సమర్పించి కావళ్ళతో కొండపైకి వెళ్ళి మొక్కులు తీర్చకున్నారు. కాగా తేరువీధిలోని షణ్ముఖ స్వామికి ప్రత్యేక వెండి ఉరువులతో ముస్తాబు చేసారు.ఉదయం నుంచి ఆలయానికి భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం స్వామి వారికి షోడషాభిషేకాలు జరిపారు.భక్తులు తమ పరిధిలో వివిధ ప్రసాదాల వితరణ జరిపారు.కాగా చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ ఎత్తున కావళ్ళతో కదల వెళ్ళారు.

## హరోంహర నామస్మరణతో మార్మోగిన ఆలయాలు



చౌడేపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త: కృతిక సందర్భంగా మండల వ్యాప్తంగా గల సుబ్రమణ్య స్వామి ఆలయాలు హరోంహర నామస్మరణతో మార్మోగాయి. స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఉదయాన్నే ప్రధానార్చకులు రాజశేఖర్‌దీక్షితులు, కుమార, మహేష్‌స్వాములు విశేషాభిషేకం, సర్వాంగ సుందరంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కావిళ్ళను మోసుకొచ్చి ముడుపులు చెల్లించారు. రాత్రి స్వామి, అమ్మవార్లు నెమలివాహనంపై ఊరేగారు. ఆలయ అధికారులు, అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలందించారు.

## స్విమ్స్‌లో ఉత్తమ వైద్య సేవలకు అవార్డుల ప్రదానం



తిరుపతి హెల్త్, ఆగస్టు 16 ప్రభాతవార్త : స్విమ్స్ వైద్య విభాగంలో అత్యుత్తమ సేవలు అందించిన వైద్యులు, ఉద్యోగులు ఎస్వీయూనివర్శిటీ తారకరామ స్టేడియంలో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ప్రశంసాపత్రాలను అందుకున్న అనస్థీషియా విభాగాధిపతి డా. అలోక్‌సమంత్‌రే, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రజాసంబంధాల విభాగం వి.రాజశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్. సతీష్‌లను స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్‌వి.కుమార్ అభినందించారు.